క్లుప్తంగా

నేడు జన్వాడకు మంచు లక్ష్మీప్రసన్న

శంకర్‌పల్లి: మండలంలోని జన్వాడ గ్రామానికి సోమవారం ప్రముఖ సినీ నటి మంచు లక్ష్మీప్రసన్న రానున్నారు. 'టీచ్ ఫర్ చేంజ్', వెనీ రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 1000 మంది విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్స్, ప్లేట్స్ ఇవ్వనుండగా.. ఈ కార్యక్రమానికి ఆమె, స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు టీచ్ ఫర్ చేంజ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఆయుబ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇవే కాకుండా జన్వాడ ప్రభుత్వ పాఠశాలలో రెండు అదనపు తరగతి గదులను సైతం నిర్మించనున్నట్లు స్పష్టం చేశారు.

ఇంకుడు గుంతలను ప్రోత్సహించాలి

కొత్తూరు: గ్రామాలు, పట్టణాల్లో ప్రజలు స్వచ్ఛందంగా ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టే విధంగా అధికారులు ప్రోత్సహించాలని బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు రణధీర్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి భూగర్భజలాల పెంపులో ఇంకుడు గుంతల ప్రాధాన్యతపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఇంట్లో, ప్రభుత్వ కార్యాలయాలు, రోడ్ల పక్కన ఇంకుడు గుంతలు నిర్మిస్తే భూగర్భ జలాలు పెరిగి వేసవిలో నీటి కోసం ఇబ్బందులు లేకుండా ఉంటాయన్నారు. గత ప్రభుత్వాలు ఇంకుడు గుంతల నిర్మాణాలపై కార్యక్రమాలు చేసినప్పటికీ పెద్దగా ఫలితాలు లేవన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇంకుడు గుంతల నిర్మాణాలపై దృష్టి పెట్టాలని కోరారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



పార్టీ శ్రేణులతో ఎమ్మెల్యే కసిరెడ్డి

మాడ్గుల: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థుల గెలుపునకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో పలువురు పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. పదవుల కోసం ఎవరూ ఆరాట పడొద్దని, పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోనాలకు ఆహ్వానం

కడ్తాల్: మండల కేంద్రంలో ఈ నెల 16 నుంచి 19 వరకు జరగనున్న బోనాల ఉత్సవాలకు సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మార్కెట్ చైర్ పర్సన్ యాటగీతలను ఉత్సవ కమిటీ నాయకులు ఆహ్వానించారు. ఆదివారం మండల కేంద్రంలో పోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్ సత్యంయాదవ్ ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రికలు అందజేశారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాజేశ్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, ఉత్సవ కమిటీ సభ్యులు రాములు, మల్లేశ్‌గౌడ్, కార్తీక్ ఉన్నారు.

మరోసారి అధికారం చేపట్టేందుకు కుట్ర



వాల్‌పోస్టర్ ఆవిష్కస్తున్న సీపీఐ నాయకులు

తుర్కయంజాల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మరోసారి అధికారం చేపట్టే కుట్రలో భాగంగానే బీహార్‌లో భారీగా ఓట్లను తొలగించిందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య ఆరోపించారు. ఆదివారం ఆ పార్టీ మున్సిపాలిటీ కార్యదర్శి కాటం రాజు ఆధ్వర్యంలో రాగన్నగూడలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అధికార పార్టీ అండదండలతో ప్రభుత్వ భూముల కబ్జాలు కొనసాగుతూనే ఉన్నాయని, పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసే వరకు పోరాటం కొనసాగుందని పేర్కొన్నారు. అనంతరం ఈ నెల 19 నుంచి 22 వరకు మేడ్చల్ జిల్లాలో నిర్వహించనున్న పార్టీ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఈదులకంటి అనురాధ, కృష్ణయ్య, విజయ, శివ ప్రసాద్, శ్రీకాంత్, భాస్కర్, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు అధ్వానం.. ప్రయాణం నరకం

- బురదమయంగా ముర్తూజగూడ–మొయినాబాద్ రోడ్డు
- వాహనదారుల రాకపోకలకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు



ముర్తూజగూడ సమీపంలో బురదమయంగా రహదారి



2023లో రోడ్డు నిర్మాణానికి వేసిన శిలాఫలకం

మొయినాబాద్‌రూరల్: గ్రామీణ రోడ్లు ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో కురుస్తున్న వర్షాలకు అధ్వానంగా మారాయి. దీంతో వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. రోడ్లపై భారీగా గుంతలు ఏర్పడి వాటిల్లో వరదనీరు చేరడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ముర్తూజగూడ నుంచి మొయినాబాద్ వెళ్లే రోడ్డు పరిస్థితి ఇది. ఈ రోడ్డు మరమ్మతులకు గత ప్రభుత్వంలో నిధులు మంజూరైనా కాంట్రాక్టర్లు రాకపోవడంతో పనులు ప్రారంభించలేకపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పనులను చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రెండేళ్లైనా..

మండల కేంద్రమైన మొయినాబాద్ నుంచి ముర్తూజగూడ వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రోడ్డు నిర్మాణానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో 2023వ సంవత్సరంలో సీఆర్ఆర్ నిధులు 1.45కోట్లు మంజూరయ్యాయి. దాదాపు 2 కిమీ మేర రహదారి నిర్మాణ పనులకు అప్పట్లో మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య శంకుస్థాపన చేశారు. రెండు సంవత్సరాలు అవుతున్నా రోడ్డు పనులు పట్టించుకున్న పాపాన పోలేదు. కనీసం మరమ్మతులు చేపట్టలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పనులు చేపట్టాలని వివిధ గ్రామాల వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రమాదాలకు గురవుతున్నారు



మొయినాబాద్ నుంచి ముర్తూజగూడ రోడ్డులో వివిధ గ్రామాల ప్రజలు ప్రయాణిస్తారు. కురుస్తున్న వర్షాలతో గుంతలు పడి బురదమయంగా మారింది. ఎక్కడ గుంత ఉందో తెలియక ప్రమాదాలకు గురవుతున్నారు. రెండు సంవత్సరాల క్రితం ఈ రోడ్డు పనులకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో శంకుస్థాపన చేశారు. ఇప్పటివరకు పనులు ప్రారంభం లేదు. ఇప్పటికైనా అధికారులు పనులను చేపట్టేలా చూడాలి.

– పాలమాకుల కృష్ణయాదవ్, మాజీ సర్పంచ్, ముర్తూజగూడ

టెండర్లు రాక నిధులు రద్దయ్యాయి

ముర్తూజాగూడ–మొయినాబాద్ రోడ్డు నిర్మాణానికి సీఆర్ఆర్ నిధులు 1.40 కోట్లు మంజూరు కాగా.. 2023లో శంకుస్థాపన చేసిన మాట నిజమే. అప్పట్లో ఈ పనులు చేసేందుకు ఎవరు ముందుకు రాలేదు. దీంతో టెండర్లు వేయకపోవడంతో నిధులు రద్దయ్యాయి. మళ్లీ నిధులు మంజూరైతే రోడ్డు వేస్తాం.

– విజయ్‌కుమార్, పీఆర్ డిప్యూటీ డీఈ, మొయినాబాద్

వానొస్తే.. అండర్‌పాస్ క్లోజ్

- భారీగా చేరుకున్న వరదనీరు
- వాహనదారులకు తప్పని తిప్పలు



అండర్‌పాస్ కింద చేరిన వరద నీరు

కొత్తూరు: ట్రాఫిక్ ఇబ్బందులతో పాటు కొత్తూరు వైజంక్షన్ కూడలిలో రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలనే ఉద్దేశంతో నిర్మించిన అండర్ పాస్ అభాసుపాలవుతోంది. ఇంజినీర్ల వైఫల్యం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా వాహనదారులు కొత్త కష్టాలు పడాల్సి వస్తోంది. చిరుజల్లులు కురిసిన అండర్‌పాస్ కింద నీరు చేరుకుంటున్నాయి. వెంటనే రోడ్డు నిర్వహణ చేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బంది ఆ రోడ్డును మూసివేస్తున్నారు. వాస్తవానికి హైదరాబాద్ నుంచి షాద్‌నగర్, కొత్తూరు పారిశ్రామికవాడ, పాత జాతీయ రహదారిపైకి వాహనాలు అండర్‌పాస్ కింద నుంచే రావాల్సి ఉంటోంది. నిత్యం పాత జాతీయ రహదారి గుండా వేల సంఖ్యలో వాహనాలు అండర్ పాస్ కింద నుంచి రాకపోకలు కొనసాగిస్తున్నాయి. కాగా వర్షాలు కురిస్తే మాత్రం హైదరాబాద్ నుంచి పాత జాతీయ రహదారిపైకి వచ్చే వాహనదారులు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది.

తప్పని తిప్పలు

వర్షాలు కురిసిన సమయాల్లో అండర్‌పాస్ కింద భారీగా వరద నీరు చేరుకుంటుండడంతో మూసివేస్తున్నారు. దీంతో హైదరాబాద్ నుంచి పాత జాతీయ రహదారిపైకి వచ్చే వాహనాలు పెంజర్ల, దర్గా కూడళ్ల వద్ద యూటర్న్ చేసుకోవాలి. ఈ క్రమంలో ఈ కూడళ్ల వద్ద భారీగా ట్రాఫిక్‌జామ్, ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పారిశ్రామికవాడ ఉండడంతో భారీ వాహనాలు యూటర్న్ తీసుకోవడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. డ్రైవర్లు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్న ప్రమాదాలు తప్పవు. నిత్యం ట్రాఫిక్ పోలీసులు కూడళ్ల వద్ద ట్రాఫిక్ జామ్ లేకుండా చర్యలు తీసుకుంటున్నప్పటికీ వాహనాల రద్దీ కారణంగా ఇబ్బందులు తప్పడం లేదు.

ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి



పనులను ప్రారంభిస్తున్న పూర్వ విద్యార్థులు

చేవెళ్ల: తాము చదివిన పాఠశాలలో మౌలిక వసతులు కల్పించేందుకు పూర్వ విద్యార్థులు ముందుకొచ్చి.. మరుగుదొడ్ల నిర్మాణానికి కృషి చేశారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో 1990లో 7వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు బండారి చెన్నారెడ్డి, కనకమామిడి తిరుపతిరెడ్డి, దేవర వెంకట్‌రెడ్డి, ముప్వ అమరేందర్ యాదవ్, మల్గారి లక్ష్మారెడ్డి, గడ్డం దయానంద్ కలిసి రూ.5లక్షల నిధులతో మరుగుదొడ్లు, మౌలిక వసతుల కల్పనకు సహకారం అందించారు. చేవెళ్లకు చెందిన రెడ్డిశెట్టి శ్రీనివాస్ పర్యవేక్షణలో వారందరూ ఈ అభివృద్ధి పనులు చేపట్టారు. ఆదివారం వారందరూ కలిసి పనులను ప్రారంభించారు. పాఠశాలకు సహకారం అందించేందుకు పూర్వ విద్యార్థులు ముందుకు రావటం అభినందనీయమని రెడ్డిశెట్టి శ్రీనివాస్‌గుప్తా అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని కోరారు. దీంతో పాటు చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి తన జన్మదినం సందర్భంగా ప్రత్యేకంగా మరో లక్ష రూపాయలను పాఠశాల అభివృద్ధికి అందజేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో చేవెళ్ల గ్రామ నాయకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీలపై కాంగ్రెస్ కపట ప్రేమ

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం



బూత్ కమిటీ అధ్యక్షులను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

షాబాద్: రాష్ట్రంలో బీసీలపై కాంగ్రెస్ ప్రభుత్వ కపట ప్రేమ ఒలకబోస్తోందని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ముదిరాజ్ భవన్‌లో షాబాద్ పోలింగ్ బూత్ కమిటీ అధ్యక్షులను ఎన్నుకున్నారు. షాబాద్ 194 బూత్ అధ్యక్షుడిగా రాజేష్, 195 బూత్ అధ్యక్షుడిగా ఎల్.నరేశ్‌కుమార్, 196 బూత్ అధ్యక్షుడిగా రమేశ్ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ ఖరారు చేసే హక్కు రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుందని, అయినప్పటికీ 42 శాతం బీసీ రిజర్వేషన్ కోసం కేంద్రంపై ఒత్తిడి తేవడం సిగ్గుచేటున్నారు. మతపరమైన రిజర్వేషన్లు ఇవ్వరాదని సుప్రీంకోర్టు తీర్పు ఉన్నా బీసీ రిజర్వేషన్లు ముందుకు తెచ్చి బీజేపీని బదనాం చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. 12 శాతం ఉన్న ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్ ఎందుకు కల్పించాలో వివరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వానికి బీసీలపై ప్రేమే ఉంటే బీసీ విద్యార్థులకు రావాల్సిన రూ.8వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని కార్యకర్తలకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు కైవసం చేసుకోవాలని కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. బీజేపీతోనే పేదలకు సంక్షేమ ఫలాలు అందుతాయని, ప్రధాని మోదీ నాయకత్వంలో బీజేపీ దేశవ్యాప్తంగా బలమైన శక్తిగా మారిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మానయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పీసరి సతీష్‌రెడ్డి, బీజేపీ మాజీ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, స్వచ్ఛ భారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము, మండల ప్రధాన కార్యదర్శి హరీష్, పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేయడం తగదు

ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వం పండగ వేళ బస్సు చార్జీలు పెంచి.. ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాఖీ పండగ సందర్భంగా ప్రభుత్వం బస్సు చార్జీలను పెంచడం సరికాదన్నారు. పేదలపై పండగ వేళ ఆర్థిక భారం మోపడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. బస్‌స్టాప్‌లలో ప్రయాణికులు నిండుగా ఉన్నా బస్సులు మాత్రం సరిపడా నడపడం లేదని ఆరోపించారు. దీంతో వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉచిత బస్సు పథకం ప్రయాణికుల పాలిట శాపంగా మారిందన్నారు. పండగ వేళల్లో ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా కనీస సౌకర్యాలు కల్పించడంలో ఆర్టీసీ పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. సమావేశంలో నాయకులు తరుణ్, శివ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ కమలనాథులు



ఇంటింటి ప్రచారం చేస్తున్న నాయకులు

యాచారం: స్థానిక సంస్థల ఎన్నికల్లో పల్లెల్లో బీజేపీ జెండాను ఎగుర వేస్తామని ఆ పార్టీ నాయకులు ధీమా వ్యక్తంచేస్తున్నారు. మహా సంపర్క్ కార్యక్రమంలో భాగంగా వారం రోజులుగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు విజయనాయక్ ఆధ్వర్యంలో కమలనాథులు ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. మండలంలోని మొండిగౌరెల్లి, నందివనపర్తి, నస్దిక్‌సింగారం, చింతుల్ల, ధర్మన్నగూడెం, తాడిపర్తి గ్రామాల్లో పర్యటిస్తున్నారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించిన కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేస్తూ.. ప్రచారం చేస్తున్నారు. కేంద్రం నిధులతో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొంటున్నారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీకి అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు సిద్ధం

- శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో ఐదురోజుల పాటు ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



అభయాంజనేయస్వామి ఆలయం

చేవెళ్ల: మండలంలోని తంగడపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయంలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠతో పాటు పోచమ్మ తల్లి, నాగబంధ, నాబిశీల విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 13వ తేదీ నుంచి మొదలుకొని ఐదు రోజుల పాటు 18వ తేదీవరకు ప్రతి రోజు ప్రత్యేక పూజలు, హోమాలు, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ మహోత్సవ కార్యక్రమాలను శ్రీ త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి పర్యవేక్షణలో కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఈ ప్రాంతంలో ఎక్కడా లేని విధంగా గ్రామంలో హనుమాన్ ఆలయం నిర్మించామన్నారు. ఎంతో మంది దాతల సహకారంతో రూపుదిద్దుకున్న ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు స్పష్టం చేశారు. గ్రామంలో ఐదురోజుల పాటు ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగనున్నాయని తెలిపారు. పెద్దసంఖ్యలో భక్తులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



అతిథులను సన్మానిస్తున్న నిర్వాహకులు

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని సంకెపల్లిగూడ గ్రామంలో మల్లన్నస్వామి, కల్యాణం, బోనాల ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో వారు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుంటే మానసిక ప్రశాంతత కలుగుతుందని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు తమ ఇష్ట దైవాన్ని కొలవాలని, భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఆలయ నిర్వాహకులు ఉత్సవాల్లో పాల్గొన్న అతిథులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ చంద్రశేఖర్, నాయకులు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళాలు



మాజీ ఎమ్మెల్యే నర్సింలుకు చెక్కు అందజేస్తున్న దాతలు

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధికి దాతలు విరాళాలు అందజేశారు. ఫరూఖ్‌నగర్‌కు చెందిన మాజీ వార్డుసభ్యుడు గోపాలకృష్ణ దంపతులు రూ.51వేలు, పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు విశ్వనాథం రూ.21,999, నలమోని శ్రీధర్ రూ.21వేల విరాళాలను ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం దాతలు తమ విరాళాల చెక్కును మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని, తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కో ఆప్షన్ సభ్యులు ఒగ్గు కిషోర్, గంధం ఆనంద్, సాయీశ్వర్ రెడ్డి, భూపాల్, శ్రీనివాసచార్యులు, సూరిశెట్టి నర్సింలు, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. బోనాల ఉత్సవం



కేశంపేట: బోనాల ఊరేగింపు



షాబాద్: బోనాల ఊరేగింపు

కేశంపేట: మండల పరిధిలోని బోధునంపల్లిలో బీరప్ప బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని బీరప్ప దేవాలయానికి మహిళలు బోనాలను తీసుకెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రామస్తులు, కులపెద్దలు పాల్గొన్నారు.

మల్లారెడ్డిగూడలో..

షాబాద్: మండల పరిధిలోని మల్లారెడ్డిగూడలో ఆదివారం మల్లన్న బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్ల మధ్య మహిళలు బోనాలతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, యువకుల కేరింతలతో గ్రామంలో సందడిగా మారింది.

సంకెపల్లిగూడలో..

మండల పరిధిలోని సంకెపల్లిగూడ గ్రామంలో ఆదివారం మల్లన్న బోనాలు, కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే భక్తులు దేవాలయం వద్ద బారులు తీరి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చి స్వామివారికి నైవేద్యాలు సమర్పించారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.



షాబాద్: మల్లారెడ్డిగూడలో బోనాలతో మహిళలు



షాబాద్: బోనాల ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి

మండల వ్యవసాయాధికారి శంకర్‌లాల్



చేవెళ్ల వ్యవసాయ కార్యాలయం

చేవెళ్ల: ప్రభుత్వం రైతులకు అందిస్తున్న రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 13వ తేదీవరకు అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి శంకర్‌లాల్ తెలిపారు. ఆదివారం ఆయన ఓ ప్రకటనలో మాట్లాడుతూ.. 2025 జూన్ 5వ తేదీవరకు కొత్తగా పట్టా పాస్‌బుక్ వచ్చిన రైతులు రైతుబీమాకు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. గతంలో రైతు బీమాకు దరఖాస్తు చేసుకున్న రైతులు మళ్లీ చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. బీమాకు దరఖాస్తు చేసుకునే రైతులు తమ పరిధిలోని ఏఈఓలను కలిసి దరఖాస్తులను అందజేయాలని సూచించారు. దరఖాస్తులకు రైతు బీమా దరఖాస్తు ఫారం నామినేషన్ ఫారం, పట్టా పాస్‌బుక్ జిరాక్స్, రైతు ఆధార్‌కార్డు, నామినీ ఆధార్ కార్డులను జతచేయాల్సి ఉంటుందన్నారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు ఉన్నవారు మాత్రమే అర్హులని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇక గతంలో రైతు బీమాకు దరఖాస్తులు చేసుకున్న రైతులు ఏమైన మార్పులు చేర్పులు ఉంటే చేసుకునేందుకు ఈనెల 12వ తేదీవరకు అవకాశం ఉందని తెలిపారు. ఆధార్‌కార్డు మార్పిడి, నామినీ మార్పిడి, లాంటి మార్పులకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. క్లస్టర్ల వారీగా రైతులు ఏఈఓలను కలిసి దరఖాస్తులు చేసుకోవాలని, ఇతర వివరాలకు సంబంధిత వ్యవసాయాధికారులను స్పందించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

శంకర్‌పల్లి: జూన్ 5వ తేదీవరకు పట్టా పాసుపుస్తకాలు వచ్చిన రైతులు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని శంకర్‌పల్లి వ్యవసాయాధికారి చైతన్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13వ తేదీ వరకే అవకాశం ఉందని, సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

13 వరకు అవకాశం

మొయినాబాద్: రైతు బీమా పథకానికి ఈ నెల 13వరకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి అనురాధ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తగా పట్టాదారు పాసుపుస్తకం పొంది.. 18–59 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న రైతులు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, నామినీ ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలతో మండల వ్యవసాయాధికారులను సంప్రదించి దరఖాస్తు అందజేయాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
జి. మల్లికార్జున్
9505507564